



నీళ్లున్నా..
నిధులెట్లా..?



హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగిన బీసీ రాజకీయ యుద్ధభేరి సభలో ఐక్యత చాటుతున్న బీసీ నాయకులు

గర్జించిన బీసీ

బీసీ యుద్ధభేరి సభ బీసీల హక్కుల కోసం నినదించింది. 47 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు నిద్రపోమని బీసీ సంఘాల నాయకులు భీష్మ ప్రతిజ్ఞ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ కోసం సంఘటితంగా పోరాడతామని ప్రకటించారు. ఈడబ్ల్యూఎస్ 10శాతం రిజర్వేషన్లను రద్దు చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉదాసీన వైఖరిపై తీవ్రస్థాయిలో గళమెత్తారు. రాబోయే రోజుల్లో హక్కుల సాధనకు పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను సైతం కలుపుకొనిపోవాలని సభలో ప్రసంగించిన నాయకులు పిలుపునిచ్చారు. బీసీలతో పాటు ఎస్సీ, మైనారిటీ వర్గాల నాయకులు కూడా సభలో పాల్గొని బీసీల పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఆదివారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీసీ రాజకీయ యుద్ధభేరి సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బీపీ మండల్ మనుమడు సూరజ్ మండల్ బీసీలకు న్యాయంగా దక్కాల్సిన రిజర్వేషన్ల అమలు కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఇందుకోసం ఒక రోజు దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని బీసీలు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టాలని సూచించారు. సభలో ఆర్.క్రిష్ణయ్య, తీన్మార్ మల్లన్న తదితరులు బీసీలకు దక్కాల్సిన బీసీల వాటా గురించి గళమెత్తారు.

- జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు దక్కాలి..
- బీసీ కోటా 47 శాతానికి పెంచాల్సిందే..
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను రద్దు చేయాలి
- హోరెత్తిన బీసీ రాజకీయ యుద్ధభేరి సభ
- ఆర్ట్స్ కళాశాలకు పెద్దఎత్తున తరలివచ్చిన జనం
- న్యాయమైన వాటా కోసం దేశవ్యాప్తంగా కదలాలి
- బీపీ మండల్ మనుమడు సూరజ్ మండల్ పిలుపు
- వరంగల్ సభ దిక్సూచి కావాలి..
- తమిళనాడు డీఎంకే ఎంపీ విల్సన్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్ణయ్య, సూరజ్ మండల్, డీఎంకే ఎంపీ విల్సన్



హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు హాజరైన బీసీలు

హనుమకొండ/హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ మైదానంలో ఆదివారం జరిగిన బీసీ యుద్ధభేరి సభ ఆద్యంతం ఉద్యమ ఉద్వేగంగా సాగింది. నేతలు ప్రసంగాల్లో బీసీలకు రిజర్వేషన్ల అమలులో జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపారు. విశాలమైన సభా వేదికపై వివిధ బీసీ సంఘాల నేతలు ఒక్కతాటిపై నిలబడి సంఘటిత శక్తిని చాటారు. ఈ భారీ సభకు బీసీ జాతీయ నాయకులు కూడా హాజర య్యారు. ఈ సభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కేంద్ర బిందువుగా నిలిచారు. సభ నిర్వహణకు సారథ్యం వహించిన ఆయన కు సభ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటిం చింది. భావి బీసీ నేతగా కొనియాడింది. కళాకారులు బీసీ ఉద్యమ గీతాలతో సభికులను ఉర్రూతలూగించారు.

ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సూరజ్ మండల్ మాట్లాడుతూ.. బీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ఇతర అణగారిన వర్గాలకు చట్టబద్ధంగా దక్కాల్సిన హక్కులను కాలరాసేందుకు కుట్ర చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా ఏకంగా రాజ్యాంగాన్నే రద్దు చేయాలని చూస్తోందని అన్నారు. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో భారత రాజ్యాంగాన్ని రక్షించు కోవలసిన బాధ్యత అణగారిన, బడుగు, బలహీనవర్గాల మీద ఉందని ఉద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం జనాభా గణన ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు. జన గణన నిర్వహిస్తే బీసీలకు రిజర్వేషన్లు పెంచాల్సి ఉంటుందన్న కారణంతోనే మోదీ సర్కారు వెనుకడుగు వేస్తోందన్నారు. రాహుల్‌గాంధీతోపాటు అన్ని పార్టీల అగ్రనాయకులు జనగణన

మిగతా 5వ పేజీలో...



కేంద్ర బడ్జెట్‌లో ఓరుగల్లు సాగునీటి ప్రాజెక్టులకు నిరాశ

- దేవాదుల, మోడికుంట, పాలెంవాగు ప్రాజెక్టులకు కలగని మోక్షం
- దేవాదులకు రూ.100కోట్లు, మోడికుంటకు రూ.276కోట్ల కోసం ప్రతిపాదనలు
- చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును ఏఐబీపీలో చేర్చి రూ.171కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి
- మోడికుంట ప్రాజెక్టుకు 20ఏళ్లుగా పెరుగుతున్న అంచనా వ్యయం
- 2026 మార్చికి దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్ర సహకారం లేకపోవడంతో ఓరుగల్లు ప్రాజెక్టులకు ఆటంకాలు

పరిశ్రమలు, ఆదాయపు పన్ను, పథకాలకు నిధులిచ్చిన కేంద్ర ప్రభుత్వం.. సాగునీటి ప్రాజెక్టులపై వివక్ష చూపింది. శనివారం పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయలేదు. ముఖ్యంగా యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రామ్ (ఏఐబీపీ) పథకం కింద ఉన్న ప్రాజెక్టులను సైతం పరిగణలోకి తీసుకోలేదు. ఈ పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగు సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు, మోడీకుంట, పాలెంవాగు ప్రాజెక్టు, ఎస్సారెస్పీ-2 కాలువలకు ఈ పథకం ద్వారా నిధులు అందించాల్సి ఉంది. అయితే వీటిని కేంద్రం పూర్తిగా విస్మరించింది. దీంతో వీటి నిర్వహణ, మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

5

కుంభమేళాలో తప్పిపోయిన కేసముద్రం విలేజి వాసి

- 68 ఏళ్ల వృద్ధుడు, మొబైల్ లేదు, హిందీ రాదు
- అక్కడి పోలీసులకు ఫిర్యాదు



కాసాని భిక్షం (ఫైల్)

కేసముద్రం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజికి చెందిన 68 ఏళ్ల వృద్ధుడు కాసాని బిక్షం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో తప్పిపోయాడు. ఆదివారం కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం. గతనెల 20న కేసముద్రం విలేజి, ఉప్పరపల్లి తదితర గ్రామాలకు చెందిన 30 జంటలు కుంభమేళాను దర్శించేందుకు ఒక్కోజంటకు రూ.32వేల చొప్పున అద్దె మాట్లాడుకొని బస్సులో బయలు దేరారు. ఈ జంటల్లో భిక్షం, మల్లమ్మ దంపతులు కలిసి వెళ్లారు. ఈ ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్నవరం, ఒరిస్సా, భువనేశ్వర్ ప్రాంతాల్లో పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ గతనెల 26 వరకు ప్రయాగ్‌రాజ్‌కు 10కిలోమీటర్ల దూరంలోని ప్రాంతానికి చేరుకున్నారు. మరుసటి రోజు 27న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో నదిలో స్నానం చేసేందుకు ఈ బృందం అందరూ వెళ్లి సాన్నాలు చేసి బయటకు వచ్చిన తర్వాత జనంగుంపులో కాసాని భిక్షం తప్పిపోయాడు. ఆయనకు హిందీ రాకపోవడం, పైగా మొబైల్ లేకపోవడంతో ఆచూకీ కనిపెట్టలేకపోయారు. దీంతో వీరిని యాత్రలకు తీసుకువెళ్లిన నిర్వాహకుడు అక్కడ తెలిసినవారికి సమాచారం అందించి, గాలిస్తున్నాడు. కుటుంబసభ్యులు సైతం కుంభమేళాలో తమకు తెలిసిన వారి ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, కుంభమేళాలో సహాయక కేంద్రాలకు సమాచారం అందించి మైకుల్లో ప్రకటనలు ఇప్పిస్తూ వివిధ వర్గాలద్వారా ఆచూకీ కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవలె జగిత్యాలకు చెందిన నలుగురు అక్కాచెళ్లెళ్లు కుంభమేళాలో తప్పిపోయి తిరిగి వచ్చిన క్రమంలో తమతండ్రి కూడా ఎవరైనా తెలుగువారు కలిస్తే తిరిగి వస్తాడని ఆయన కుమారుడు ఐలయ్య ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





మేడారంలో భక్తులతో రద్దీగా ఉన్న గద్దెల ప్రాంగణం

మేడారంలో జన సందోహం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- వనదేవతలకు మొక్కుల సమర్పణ
- మినీ జాతరకు ముందుగానే సందడి

చిన్న జాతరకు ముందుగానే జన సందోహం నెలకొంది. మేడారం సమ్మక్క - సారలమ్మల సన్నిధికి ఆదివారం భారీగానే భక్తులు తరలివచ్చారు. జంపన్నవాగులో స్నానాలాచరించి ఎత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 12 నుంచి 15 వరకు మినీ జాతర ఉండగా సెలవు దినం కావడంతో ముందస్తుగా జనం తరలివచ్చారు. ఆదివారం 70వేలకు పైగా భక్తులు హాజరైనట్లు అధికారులు చెప్పారు. ఈ మేరకు పోలీసులు బందోబస్తు, అధికారులు ఏర్పాట్లు చేశారు.

- తాడ్వాయి, ఆంధ్రజ్యోతి

5

సాగుకు యోగ్యం కాని భూమి
8,433.01 ఎకరాలు

- జిల్లా వ్యాప్తంగా గుర్తించిన సంబంధిత అధికారులు
- రైతుబంధు కింద గుట్టలకు, రాళ్లకు ఏటా రూ.8.43 కోట్లు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెల్లించిన వైనం



అర్పనపల్లి శివారులో ఉన్న క్వారీలను తనిఖీ చేస్తున్న అధికారుల బృందం (ఫైల్)

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు పథకం కింద ప్రజాధనం నిధులు వ్యవసాయానికి పనికిరాని భూములకు పంపిణీ చేయడంతో దుర్వినియోగం అయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో రాళ్ల, రప్పలు, గుట్టలు, క్వారీలకు, లే-అవుట్ కింద అయిన రియల్‌ఎస్టేట్ భూములు, మైనింగ్ క్వారీలకు సాగుకు అనువుగా లేని భూములకు అందించినట్లు జిల్లా వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారుల బృందాలు ఇటీవల వెలికితీశాయి. రైతుబంధు పథకం కింద ఏడాదికి ఎకరాకు రూ.10 వేల చొప్పున అందించారు. జిల్లాలో 8,433.01 ఎకరాల్లో రైతుబంధు నిధులు దారపోసినట్లు అధికారుల తనిఖీల్లో వెలుగు చూసింది. అంటే దాదాపు ఏడాదికి రూ.8.43 కోట్లు గత ప్రభుత్వ హయంలో దుర్వినియోగం అయ్యాయి. గత ప్రభుత్వం హయంలో 11 విడతల్లో రైతుబంధు కింద రూ.92.73 కోట్లు చెల్లించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రైతుభరోసాగా పేరుమార్చి ఏడాదికి రూ.12 వేలు అందిస్తున్నారు.

గతనెల 16వ తేదీ నుంచి 20 వరకు సర్వే..

మహబూబాబాద్ జిల్లాలో గతనెల 16వ తేదీ నుంచి 20 వరకు వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖల ఆధ్వర్యంలో సర్వే చేపట్టింది. ప్రతీ గ్రామానికి, సర్వే నెంబర్‌కు రాళ్ల, రప్పలు, గుట్టలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. సాగుకు అనుకూలంగా వ్యవసాయానికి అనువుగా లేని భూముల వివరాలను లెక్కలు తేల్చారు. అనంతరం జనవరి 21వ తేదీ నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించారు. జిల్లాలో 8,433.01 సాగుకు యోగ్యం కానీ భూములుగా అధికారులు గుర్తించారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున వీటికి గత 11 విడతలుగా రూ.92.73 కోట్లు పెట్టుబడి సాయం అందించింది. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో రియల్ ఎస్టేట్, రోడ్డుగా మారిన భూములకు, పరిశ్రమలు, మైనింగ్ వినియోగిస్తున్న భూములకు, గోదాముల నిర్మాణాలకు అందించారు. మహబూబాబాద్, తొర్రూరు, సీరోలు, డోర్నకల్, మరిపెడ, నెల్లికుదురు, కేసముద్రం మండలాల్లో అందాయి. రాళ్ల, రప్పలు, గుట్టలతో నిండి సాగుకు అనుకూలంగ లేని భూములు అధికంగా మరిపెడ, మహబూబాబాద్, డోర్నకల్, కురవి, సీరోలు, నెల్లికుదురు, చిన్నగూడూరుల్లో అధికంగా ఉన్నాయి.

సాగుకు పనికి రాని భూముల వివరాలు..

జిల్లాలో 3, 69,860 ఎకరాల్లో భూములు ఉన్నాయి. 270 రెవెన్యూ గ్రామాల్లో అధికారుల బృందం సర్వే చేసింది. దాంతో 8,433.01 ఎకరాలు సాగుకు యోగ్యం కానీ భూమిగా ఈ అధికారుల బృందం తేల్చింది. అందులో ఇళ్ల, కాలనీలుగా మారిన అన్నిరకాల భూములు 790.03 ఎకరాలు, రియల్ ఎస్టేట్, లేఅవుట్ రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలు, గోదాములకు, మైనింగ్‌కు వినియోగించిన భూములు 2,896.13 ఎకరాలు, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు 495.01, రాళ్ల, రప్పలు, గుట్టలతో నిండి సాగుకు అనువుగా లేని భూములు 3530 ఎకరాలు, ఇతర సాగుకు పనికి రాని భూములు 721.24 ఎకరాలు వెరసి 8,433.01 ఎకరాలుగా గుర్తించారు. కాగా, అధికారులు సర్వేచేసి తేల్చిన ఎకరాలకు ఈ రైతుభరోసా నుంచి తొలగించనున్నారు.

తెలుగుదేశమే ప్రత్యామ్నాయం

- మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య



మానుకోటలో బండి పుల్లయ్యను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్‌కు, ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా తెలుగుదేశం పార్టీ బలపడుతుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయనను పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధికంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేయించినందుకు ఆయన ప్రతిభను గుర్తించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తెలంగాణ తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఎక్కడ లేని జోష్ పెరిగిందన్నారు. రాష్ట్రంలో పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలని, ఆ పార్టీ అధినాయకత్వం అహర్నిశలు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇటీవల చేపట్టిన సభ్యత్వ నమోదులో తెలంగాణ రాష్ట్రంలో 1.77లక్షల సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా చేయించినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ హయంలో ఆంధ్రప్రదేశ్‌లో విధ్వంసం జరిగిందని, వ్యవస్థలన్ని కుప్పకూలిపోయాయని పేర్కొన్నారు.గాడితప్పిన వ్యవస్థలను సీఎం చంద్రబాబు చక్కదిద్దుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎండి.ఇమామ్, యశబోయిన ఐలయ్య, ఇస్లావత్ శశి పాల్గొన్నారు.

నేటి గ్రీవెన్స్‌సెల్ రద్దు
కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

6



రాజోలులో భర్త ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న సతీమణి మానస

అనుమానపు భర్తతో వేగలేక..

విడాకులు ఇప్పించాలని భార్య ధర్నా

కురవి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : భర్త గునిగంటి సురేందర్ నుంచి విడాకులు ఇప్పించాలని భార్య మానస ఆదివారం భర్త ఇంటి ఎదుట ధర్నా చేపట్టింది. కురవి మండలం రాజోలు గ్రామానికి చెందిన గునిగంటి సురేందర్‌కు అదే గ్రామానికి చెందిన మానసను ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. పెళ్లైన రెండు నెలల నుంచే సురేందర్ భార్యపై అనుమానంతో విడాకుల కోసం కోర్టులో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే పెద్దమనుషుల జోక్యంతో కొద్దిరోజులు కలిసి ఉన్నా తన భర్త తీరు మారకపోవడంతో భార్య మానస భర్త నుంచి విడాకులు కావాలని కోర్టును ఆశ్రయించింది. తిరిగి భర్త సురేందర్ తన భార్య తనకు కావాలంటూ కోర్టును ఆశ్రయించాడు. భర్త అనుమానాలతో విసిగి వేసారిన భార్య మానస ఆదివారం రాజోలులోని భర్త సురేందర్ ఇంటి ముందు ఆందోళన చేపట్టింది.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



సోమేశ్వర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వర్ (ఫైల్)

డోర్నకల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పోలోజు సోమేశ్వర్ (55) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన సోమేశ్వర్ డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో ఉన్న ఆయన శనివారం రాత్రి ఒక్కసారిగా అస్వస్థతకు గురై తనకు శ్వాస అందడం లేదని తోటి కానిస్టేబుళ్లకు తెలిపాడు. ఆయనను వెంటనే వారు పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు 108లో ఖమ్మం తరలిస్తుండగా సోమేశ్వర్ మృతి చెందాడు. సోమేశ్వర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, సోమేశ్వర్ మృతదేహాన్ని సొంతూరు దంతాలపల్లి మండలం పెద్దముప్పారంనకు తరలించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎస్పీ

దంతాలపల్లి, (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మండలంలోని పెద్దముప్పారానికి చెందిన సోమేశ్వర్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం పెద్దముప్పారం తీసుకు రావడంతో ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఆయన మృతదేహా నికి పూలమాల వేసి నివాళులర్పించారు. సోమేశ్వర్ కుటుంబాన్ని అన్నివిధా లుగా ఆదుకుంటామన్నారు. విధుల్లో ఆయన మృతి పోలీసు శాఖకు తీరని లోటన్నారు.

నిర్లక్ష్యంతో నీరుగారిన లక్ష్యం



మూసివేసిన న్యూట్రిమిక్స్, డ్రైమిక్స్ పరిశ్రమ

- మూతపడ్డ న్యూట్రి, డ్రైమిక్స్ యూనిట్
- ఉత్పత్తికి ఓకే.. మార్కెటింగ్ నిల్
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు
- ఉపాధి కోల్పోయిన గిరిజన మహిళలు

ఏటూరునాగారం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యం గొప్పదే కానీ ఆచరణే అడుగంటింది. భవిష్యత్‌కు దిక్సూచిగా నిలిచేది మూన్నాళ్లకే నీరుగారింది. ఐటీడీఏ స్వయంకృత అపరాధం గిరిజన మహిళలకు శాపమైంది. ఐటీడీఏ అధికారుల నిర్లక్ష్య వైఖరికి న్యూట్రిమిక్స్, డ్రైమిక్స్ పరిశ్రమ పరాకాష్ట. గిరిజన మహిళలు ఆర్థిక స్వావలంబనకు అడుగుల పడేలా వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నెలకొల్పిన న్యూట్రిమిక్స్, డ్రైమిక్స్ పరిశ్రమ ఐటీడీఏ ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి బలికానుంది. గిరిజన మహిళల ఉపాధికి ఊతమిచ్చే పరిశ్రమపై నీలినీడలు కమ్ముకున్నాయి. గిరిజన మహిళా సంఘంతో రూ. 40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన న్యూట్రిమిక్స్, డ్రైమిక్స్ యూనిట్ పరిశ్రమ మూడేళ్లు తిరిగే లోపే మూతపడింది. ఇక్రిసాట్ సహకారంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో నెలకొల్పిన పరిశ్రమ మార్కెటింగ్ లేక మూతపడింది. పరిశ్రమలో ఉత్పత్తి చేసిన సరుకును మార్కెటింగ్ చేయాల్సిన ఐటీడీఏ అధికారులు పెడచెవిన పెట్టడంతో పరిశ్రమ కుంటుపడింది.

మూడేళ్లకే మూలనపడ్డ పరిశ్రమ

మూడేళ్ల క్రితం గిరిజన మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రభుత్వం ఇక్రిసాట్ సౌజన్యంతో రూ. 40లక్షలతో ఏటూరునాగారంలో న్యూట్రిమిక్స్, డ్రైమిక్స్ పరిశ్రమను నెలకొల్పారు. పరిశ్రమలో తయారు చేసిన న్యూట్రిషన్ ఫుడ్‌ను ఐటీడీఏ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు సరఫరా చేసేందుకు పరిశ్రమను నెలకొల్పారు. 12 మంది గిరిజన మహిళా సభ్యులతో స్వయంకృషి జాయింట్ లియబిలిటీ గ్రూపును ఏర్పాటు చేసి పరిశ్రమ బాధ్యతలను వారి భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. పరిశ్రమ స్థాపనలో 10 శాతం మహిళా సంఘం సభ్యులు, 30 శాతం బ్యాంకు రుణం, 60 శాతం ప్రభుత్వం పెట్టుబడితో పరిశ్రమను స్థాపించారు. పరిశ్రమను స్థాపించిన సంవత్సర కాలంలో సుమారు రూ. 50 లక్షల దాకా న్యూట్రిషన్స్ ఫుడ్‌ను ఉత్పత్తి చేశారు. ఆ తర్వాత ఏమైందో కానీ పరిశ్రమను మూలన పడేశారు.

ఉత్పత్తికి ఓకే.. సరఫరా నిల్

ముడి సరుకు సిద్ధంగా ఉన్న పరిశ్రమను నడిపేందుకు మహిళా సభ్యులు ఆసక్తిగా ఉన్నా సంబంధిత ఐటీడీఏ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పరిశ్రమలో జోవర్ మీల్, మల్టీగ్రేన్ స్వీట్ మీల్ మూడు రకాల న్యూట్రిషన్ ఫుడ్‌ను తయారు చేస్తారు. వీటిని ఐటీడీఏ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహల్లోని విద్యార్థులకు వాటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ ఆయా పాఠశాలల్లో వాటిని సరఫరా చేసేందుకు ఐటీడీఏ అధికారులు మొగ్గు చూపడం లేదు. ఈ ఉద్దేశంతోనే పరిశ్రమను నెలకొల్పినా అధికారుల ప్రణాళికలు ఆ దిశగా సాగడం లేదు. ఐటీడీఏ ఆధ్వర్యంలోని అట్టహాసంగా నెలకొల్పిన పరిశ్రమకే అదే ఐటీడీఏ అధికారులే మొండిచేయి చూపుతుండడంతో గిరిజన మహిళలకు శాపంగా మారింది. పరిశ్రమను నడపడానికి మహిళలు ముందుకు వస్తున్నా వాటిని తమ శాఖ పరిధిలో సరఫరా చేసేందుకు అధికారులు ముందుకు రాకపోవడం శోచనీయం.

ఇండెంట్ ఇచ్చేందుకు ముందుకు రాని డిప్యూటీ డైరెక్టర్

న్యూట్రిమిక్స్, డ్రైమిక్స్ పరిశ్రమ నడిచేందుకు గిరిజన సంక్షేమ శాఖ విద్యా విభాగం కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. పరిశ్రమలో తయారైన న్యూట్రిషన్ ఫుడ్‌ను ఆ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థుల కోసం సరఫరా చేసేందుకు పరిశ్రమను నెల కొల్పుతున్నట్లు తెలిపారు. తీరా పరిశ్రమ స్థాపన జరిగాక దాని గురించే పట్టించుకోవడం లేదు. ప్రతి విద్యా సంవత్సరంలో ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులకు అవసరమైన వస్తువులు, కాస్మోటిక్, పౌష్టికాహారానికి సంబంధించిన ప్రతి దానికి టెండర్లు పిలిచి ఆయా పాఠశాలలకు అవసరమైన వాటిని అందజేస్తున్నారు. దానిలో భాగంగా పరిశ్రమలో తయారైన నాణ్యమైన న్యూట్రిషన్ ఫుడ్‌ను అందించడానికి సంబంధిత డిప్యూటీ డైరెక్టర్ ఆసక్తిని కనబర్చడం లేదు. ఇండెంట్ ఇచ్చేందుకు కొన్నేళ్లుగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ముందుకు రావడం లేదు. పలుమార్లు పరిశ్రమ ప్రారంభించేందుకు ఇండెం ట్ ఇవ్వాలని మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత శాఖ అధికారులు వేడుకుంటున్నా చూద్దాం.. చేద్దామంటూ సంవత్సరాల తరబడి కాలయాపన చేస్తున్నారు.

పాడవుతున్న యంత్రాలు

పరిశ్రమ నడవక ఏళ్లు గడుస్తుండడంతో రూ.లక్షల విలువ చేసే యంత్రాలు పాడయ్యే ప్రమాదముందని గిరిజన మహిళలు వాపోతున్నారు. విలువైన యంత్రాలు సంవత్సరాల తరబడి నడవక వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో అవి చెడిపోయే అవకాశం ఉండడంతో మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమకు తాళాలు వేసి ఉండడంతో లోపల యంత్రాల పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం కావడంలేదు. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో పరిశ్రమను పునఃప్రారంభించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ఊరు వదిలి.. ఉపాధి కోసం కదిలి..!



చిరిగిన పరదాలను కుడుతున్న వెంకటేశ్వర్లు, అంజమ్మ

- పరదాలు కిరాయికిస్తూ ఆంధ్ర వలస జీవుల బతుకుదెరువు
- ఖరీఫ్, రబీ సీజన్ కోతల సమయంలో రాక

కాటారం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి బాటలో ఉన్న ఊరును వదిలి బతుకు దెరువు కోసం వలస బాట పడుతున్నారు..ఖరీఫ్, రబీ సీజన్‌లలో వరి కోతల సమయాలలో వచ్చి పరదాలు కిరాయికి ఇచ్చి పొట్ట పోసుకుంటున్నారు. ఆంధ్ర నుంచి వలస వచ్చిన పలువురు పేదవారు మండలంలోని పలు ప్రాంతాలకు వచ్చి ఒక చోట అడ్డా ఏర్పాటు చేసుకొని పరదాలు రైతులకు అద్దెకిస్తూ ఉపాధి వెతుక్కుంటున్నారు. ఎరువుల ఖాళీ బస్తాలను స్వగ్రామంలో కొనుగోలు చేసి వాటిని పెద్ద పరదాలుగా కుట్టించు కొని వచ్చి వరి ధాన్యం పోయడానికి కిరాయికిస్తున్నారు. మండలంలోని రేగులగూడెం, గంగారం, గారెపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా నర్సారావుపేట మండలం ఎలమంద, ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం రాజుపా లెం గ్రామాలకు చెందిన పలువురు కుటుంబాలతో సహా వచ్చి రైతులకు పరదాలను కిరాయికిస్తున్నారు. ఒక్కో పరదాకు రూ. 12 కిరాయి వసూలు చేస్తున్నారు. వలసజీవులైన వొల్లెపు వెంకటేశ్వర్లు భార్య అంజ మ్మతో వచ్చి రేగులగూడెం స్టేజీ వద్ద పరదాలను కిరాయికి ఇస్తున్నారు. కాటారం డివిజన్‌లోని మండలాల్లో పలు గ్రామాల పరిధిలో ఆంధ్ర ప్రాంతం నుంచి వలసవచ్చి కొన్ని నెలలు పరదాలను కిరాయికిస్తూ జీవనం సాగిస్తున్న వారు పలువురు ఉన్నారు. గతానికి భిన్నంగా రైతులు వరిధాన్యాన్ని కల్లాల్లో పోస్తే ధాన్యం వృథా అవడమే కాకుండా మట్టి, రాళ్ళు కలిసి మద్దతు ధర రాదనే ఉద్దేశంతో హార్వెస్టర్లతో కోసిన ధాన్యాన్ని పరదాలను కిరా యికి తీసుకొని పోసి ఆరబెడుతున్నారు. గత పదేళ్లుగా ప్రతి ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఈ వలసజీవులు మండల్యాలకు వచ్చి పొట్ట పోసుకుంటున్నారు. పంటలు బాగా పండితే రైతులతో పాటు తమకు గిట్టుబాటవుతుందని పరదాల నిర్వాహకులు చెప్తున్నారు.

పరదాలు కిరాయికి ఇస్తూ ఉపాధి పొందుతున్నాం..

వొల్లెపు వెంకటేశ్వర్లు, పరదాల నిర్వాహకుడు

గత కొన్నేళ్లుగా ఈ పరదాలను కిరాయికిస్తూ ఉపాధి పొందుతున్నాం. ఎరువుల ఖాళీ సంచులను కొని కుడతాం. లారీలో తెచ్చి ఇక్కడ అడ్డా ఏర్పాటు చేసుకొని రైతులకు కిరాయికిస్తున్నాం. రైతులకు పరదాలు ఇచ్చి పద్దులు రాసుకుంటాం. వారు తిరిగి తెచ్చిన రోజు ఎన్ని రోజుల కిరాయి అయిందో లెక్క చేసి డబ్బులు తీసుకుంటాం. పరదాల ఖర్చు, రవాణా చార్జీలు పోనూ మిగిలినవాటితోనే బతుకుదెరువు సాగుతోంది.



హేమాచల క్షేత్రంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి

7 వేల మంది భక్తులు దైవ దర్శనం

మంగపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో వారంతపు సెలవు దినంతో పాటు మాఘమాస శుద్ధ పంచమి సందర్భంగా వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చారు. ముందుగా భక్తులు చింతామణి జలధారల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి జలాంజనేయస్వామి, పంచముఖాంజనేయస్వామి, వేణుగోపాలస్వామి, రమ సత్యనారాయణస్వామి దేవుళ్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తదనంతరం కొండపై కొలువుదీరిన స్వయంభు పుట్టుస్వామిగా వీరాజిల్లుతున్న లక్ష్మీనర్సింహస్వామిని పక్కనే కొలువు దీరిన అమ్మవార్లయిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పవన్‌కుమారచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మలు స్వామివారి మూలవిరాట్‌కు అర్చన, అభిషేకాలు చేశారు. పట్టువస్త్రాలు, గజమాలలతో అత్యంత సుందరంగా అలంకరించి భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థప్రసాదాలను అందజేసి ఆలయ విశిష్టత, స్వామివారి చరిత్రను వివరించారు. కార్యక్రమంలో అర్చక, ఉద్యోగులు వెంకటనారాయణశర్మ, అనిపెద్ది మురళీ కృష్ణశర్మ, సీతారాములు, లక్ష్మీనారాయణ, శేషు పాల్గొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

బయ్యారం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బాలిక పట్ల అసభ్యంగా ప్రవరించిన ఓ వృద్ధుడిపై పోక్సో చట్టం కింద ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. బయ్యారం మం డలానికి చెందిన సుమారు 50 ఏళ్ల వయస్సు వృద్ధుడు అదే మండలానికి చెందిన మైనర్‌బాలిక పట్ల అసభ్యంగా ప్రవరించాడు. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వృద్ధుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కాళేశ్వరాలయానికి కుంభాభిషేక శోభ

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ముమ్మురంగా గోపురాలకు పరంజాల పనులు
- ముఖ్య అతిథులుగా దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారులు

మహదేవపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీలలో జరిగే మహా కుంభాభిషేకానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కుంభాభిషేకానికి కావాల్సిన కళశాలు, వేద పండితులు, సామగ్రితో పాటు గోపురాలకు పరంజాలు, స్వామీజీలు ఎక్కేందుకు మెట్లు ఏర్పాట్లు చేశారు. కుంభాభిషేకం సందర్భంగా వరుసగా మూడురోజులు అన్నదానం నిర్వహించేందుకు సామగ్రిని తెచ్చిపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తునికి చెందిన శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీవారు ఆధ్వర్యంలో కుంభాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దుద్దిళ్ల శైలజ రామయ్యార్, దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ శ్రీధర్, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ముఖ్య అతిథులుగా రానున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రముఖులు వస్తారా అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. జగద్గురు ఆదిశంకరాచార్య ఆశీస్సులతో శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి వారి కరములతో ఈ ఉత్సవాలు జరుగును.



కాళేశ్వరాలయ గోపురానికి కొనసాగుతున్న పరంజాల పనులు

మూడు రోజుల కార్యక్రమాలు ఇవే..

- 7వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మంగళవాయిద్యాలతో వేద స్వస్తి వాచకాలు, గో పూజ, గణపతి పూజ, పణ్యా హవచనం, రుత్విక్ వర్ణనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశనం, అఖండ జ్యోతి ప్రజ్వలన, యాగశాల ప్రవేశం, నవగ్రహ వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, చతుర్లింగ భద్ర సర్వతో భద్ర మండప దేవతా స్థాపన పూజలు, హోమాలు, చండీపారాయణం నిర్వహించబడుతాయి. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటలవరకు మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం, చండీ సప్తశతి పారాయణం, నవార్ణమ మూల మంత్ర జపాలు, సహస్ర ఘటస్థాపన పూజలు, ప్రదోషకాల పూజ, హారతి, మంత్ర పుష్పము, చతుర్వేద స్వస్తి పారాయణం, తీర్థ ప్రసాద వితరణ జరుగును.
- 8వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ప్రాతఃసూక్త పఠనం, ప్రాతఃకాల పూజలు, చండీ పారాయణం, సహస్ర ఘటాభిషేకం, మహారుద్రాభిషేకం జరుగును. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు చండీ హోమం, ప్రదోషకాల పూజలు, హారతి, మంత్ర పుష్పం, చతుర్వేద సేవలు, తీర్థ ప్రసాద వినియోగాలు జరుగునని ఆలయ నిర్వాహకులు తెలిపారు.
- 9వ తేదీ ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు ప్రాతః సూక్త మంత్ర పఠనం, ప్రాతఃకాల పూజలు, రుద్రహననం, జయాదులు, బలి ప్రదానం, మహా పూర్ణాహుతి జరుగును. ఉదయం 10.42 గంటలకు మహాకుంభాభిషేకం, హారతి, మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించబడును.

అతి పవిత్రమైన ఘట్టం

1982లో పవిత్ర కాళేశ్వరాలయానికి జీర్ణోద్ధరణ కార్యక్రమం జరిగింది. అప్పటి నుంచి నిరంతరం భక్తులతో ఆలయం విలసిల్లుతోంది. 43 ఏళ్ల అనంతరం 2025లో ఆ మహాఘట్టానికి నిర్వహించేందుకు పీఠాధిపతులు ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో మహా కుంభాభిషేకం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఆ పవిత్ర ఘట్టానికి ఎన్నికల కోడ్ రావడంతో పలువురు భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బోనస్ కోసం ఎదురుచూపు

- చిన్నగూడూరు మండలంలో 33,575 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు
- 780లో 80 మందికే డబ్బులు జమ

చిన్నగూడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రోత్సాహకంగా బోనస్, గిట్టుబాటు ధర అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సన్న ధాన్యం సాగు చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ, వ్యవసాయ సహకార పరపతి సంఘాల కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. విక్రయించి నెలలు గడుస్తున్నా బోనస్ రాకపోవడంతో రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలో 780 మంది రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించగా, 80 మంది రైతులకు బోనస్ చెల్లించారు. మిగతా 700 మంది రైతులు బోనస్ రాకపోవడంతో ఎవరిని అడగాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

రైతు భరోసా లేదు.. బోనస్ రాలేదు

బోనస్ వస్తదని చిన్నగూడూరు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో 40 బస్తాలు అమ్మిన. విక్రయించి నెల దాటినా బోనస్ జమ కాలేదు. యాసంగి సాగుకు రైతు భరోసా అందుతది అనుకుంటే రాకపోవడంతో అప్పు చేసి సాగు చేశా. తొందరగా బోనస్, రైతు భరోసా అకౌంట్‌లో జమ చేయాలి.

బెల్లంకొండ శ్రీనివాస్, ఉగ్గంపల్లి రైతు

700 మంది రైతులు నిరీక్షణ

సన్న ధాన్యానికి మద్దతు ధర రూ. 2,320 బోనస్ రూ.500 లతో కలిసి రూ2,800 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మండలంలో కొనుగోళ్లు పూర్తయిన నాటికి చిన్నగూడూరులో 10,182 క్వింటాళ్లు, విస్సంపల్లిలో 11,180 క్వింటాళ్లు, జయ్యారంలో 7,740, గుండంరాజుపల్లిలో 4,453 క్వింటాళ్ల చొప్పున మొత్తం 780 మంది రైతుల దగ్గర నుంచి 33,575 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించారు. 700 మంది రైతులకు బోనస్ చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.



చిన్నగూడూరులోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

గర్జించిన బీసీ

(3వ పేజీ తరువాయి)

కోసం ఒత్తిడి చేస్తున్నా ప్రభుత్వం మౌనం వహిస్తోందన్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్ణయ్య పార్లమెంట్‌లో బీసీల రిజర్వేషన్లపై గట్టిగా గళమెత్తాలని కోరారు. బీసీల న్యాయబద్ధమైన రిజర్వేషన్ల అమలు కోసం తన మద్దతు ఇవ్వడానికి సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్ వరంగల్ బీసీ సభకు రావల్సి ఉందని, కానీ అనివార్యకారణాల వల్ల రాలేకపోయారన్నారు.

డీఎంకే ఎంపీ విల్సన్ మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్ల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. 1980 తర్వాత బీసీల రిజర్వేషన్లు పెరగలేదని గుర్తు చేశారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందన్న భయంతో జనగణన జరపడానికి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని ఎద్దేవా చేశారు. జనగణన జరిపితే బీసీ వర్గాలకు జనాభా దామాషాగా వారికి రిజర్వేషన్లలో న్యాయమైన వాటా దక్కుతుందన్నారు. బీసీలకు న్యాయబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయడంలో తమిళనాడు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పెరియార్, కరుణానిధి మొదలు ప్రస్తుత సీఎం స్టాలిన్ వరకు బీసీలకు న్యాయంగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని వివరించారు. తమిళనాడులో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కలిపి ప్రస్తుతం 69 శాతం రిజర్వేషన్ అమలవుతున్నదని తెలిపారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌ను ఈ వర్గాల రిజర్వేషన్లకు రక్షణగోడగా వాడుకుంటోందన్నారు. ఏ గణన లేకుండా, రాజ్యాంగాన్ని సవరించకుండా ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయడాన్ని విల్సన్ తప్పుపట్టారు. జనాభా పరంగా వారు 2 నుంచి 3 శాతం మించరని, కానీ వారికి 10 రిజర్వేషన్ అమలు చేయడం దారుణం అన్నారు. పదేళ్లలో కేంద్రం బీసీల ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. కేంద్రం 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' నినాదం బీసీల హక్కులను కాలరాయడానికి, వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టడానికేనన్నారు. కేంద్రం రాష్ట్రాల స్వేచ్ఛను హరిస్తోందన్నారు. దేశంలో త్వరలో యూనిఫామ్ సివిల్ కోడ్ అమలులోకి వచ్చినా రావొచ్చన్నారు. బీసీలంతా ఒక్కతాటిపై నిలిచి తమ హక్కులు, రిజర్వేషన్ల కోసం సంఘటితంగా పోరాడాలని విల్సన్ పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ఏడు శాతం మించి జనాభా లేని ఓసీలకు 10 శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలకు దక్కాల్సిన ఉద్యోగాలను కొల్లగొడుతున్నారన్నారన్నారు. బీసీ జనాభా లెక్క తేల్చడానికి 90 ఏళ్లు పట్టడం విచారకరమన్నారు. వచ్చే నాలుగేళ్లలో ఓసీల లెక్క తేల్చుతామన్నారు. 2029లో బీసీలదే రాజ్యాధికారం అన్నారు. రాష్ట్రంలో 509 జడ్పీటీసీ స్థానాలు ఉండగా, 12 శాతం రిజర్వేషన్లు ఉన్న మైనారిటీలకు ఒకే ఒక్క స్థానం ఉందన్నారు. తల్లిపాలు తాగే ప్రతీ బీసీ ఓటరు ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీ నేతలను గెలిపించాలని కోరారు. ఏడాదికి రూ.1.20లక్షల కోట్ల ఆదాయాన్ని పన్నుల ద్వారా బీసీలు ప్రభుత్వ ఖజానాకు సమకూరుస్తున్నారని, ఈ మొత్తంలో నుంచి రూ.9వేల కోట్లు మాత్రమే వారి సంక్షేమం కోసం ఖర్చు చేస్తోందని మల్లన్న అన్నారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంత్‌చారి ఆత్మ బలిదానం చేయగా, ఆయన చావుతో అగ్రవర్ణాల నేతలు శవరాజకీయం చేశారని విమర్శించారు. నిజానికి రెడ్లు, వెలమలు తెలంగాణవాసులు కాదన్నారు. నిజాం కాలంలో పన్నుల వసూలు కోసం ఇతర ప్రాంతాల నుంచి రప్పించారని అన్నారు. రెడ్లు, వెలమల చేతుల్లోనే వేలాది ఎకరాల భూములు ఉన్నాయని, కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తి రూ.కోట్లలో ప్రజాధనాన్ని దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జనాభాపరంగా రెడ్డి, వెలమలు పిడికెడు మంది కూడా లేరని, అసెంబ్లీలో మాత్రం 63మంది ఎమ్మెల్యేలు ఉన్నారని గణాంకాలతో వివరించారు. రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రమేనని, ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో సీఎంగా బీసీలే అధికారంలో ఉంటారని ఘంటాపథంగా చెప్పారు. ఆర్.క్రిష్ణయ్య బీసీ కోసం తన జీవితాన్ని ధారపోశాడాన్ని అన్నారు. బీసీల జాతి పితగా ప్రొఫెసర్ జయశంకర్‌ను గౌరవించుకుంటామని సభాముఖంగా మల్లన్న ప్రకటించారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల స్థానంలో రెడ్డ, వెలమ ఓట్లు 2027 ఉండగా, బీసీల ఓట్లు 20వేలకు పైగా ఉన్నాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అగ్రవర్ణాలను ఓడించమే తమ లక్ష్యమన్నారు. వరంగల్ బీసీ రాజకీయ యుద్ధ సభ రెడ్డి, వెలమలకు, బీసీలకు మధ్య విడాకుల సభగా తీన్మార్ మల్లన్న అభివర్ణించారు.



బహిరంగ సభలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఆర్ కృష్ణయ్య, బీసీ నేతలు



బీసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో సర్పంచులు, ఎంపీటీసీలు గెలిస్తే అగ్రకులాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. కులాలపేరుతో రాజకీయాలు చేస్తూ బీసీల ఐక్యతను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. 70 ఏళ్లుగా బీసీల వాటా తేల్చకుండా అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. మర్యాద పూర్వకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా బీసీల వాటాను అడుగుతున్నామన్నారు. బీసీ కులాల్లో పేదలు ఉండడానికి నీడ, తినడానికి తిండి లేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ పిల్లలు జీవితంలో రాణించడానికి వారికి ఉన్నత చదువులు చదివించాలని, అన్నిరంగాల్లో రాణించేలా చూడాలని క్రిష్ణయ్య కోరారు. రాష్ట్రంలో ప్రతీ బీసీ కుటుంబానికి బీసీ బంధు ద్వారా రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 1978, 1982 లో బీసీ ఉద్యమాలు చేపట్టి బీసీ హక్కుల కోసం పోరాటం చేశామని గుర్తు చేసుకున్నారు. ఇప్పటికైనా బీసీలు తమ ఉద్యమ పంథాను మార్చుకొని తమ న్యాయమైన రిజర్వేషన్ల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మూడు శాతం ఉన్న ఓసీలు పదిశాతంతో బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. బీసీలందరూ తమ జాతి పట్ల అంకితభావంతో రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం చేయాలని క్రిష్ణయ్య పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బీసీలకు కలిసొచ్చే సభా వేదిక అన్నారు. 1983లో అప్పటి కాంగ్రెస్ పార్టీ ఈ మైదానంలోనే భారీ ఎన్నికల సభ నిర్వహించి తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు బీసీ కులాలన్నీ అండగా నిలిచి ఆయన సాగించే పోరాటంలో వెంట నడుస్తాయని హామీ ఇచ్చారు. బీసీలకు 50 శాతం రిజర్వేషను పెంచినప్పుడే నిజమైన న్యాయం జరిగినట్లు అన్నారు. తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఆహుతి అయినవారిలో బీసీలే ఎక్కువ మంది అన్నారు. తన కొడుకు శ్రీకాంతాచారి చనిపోతే నాలుగు గోడల మధ్య ఉన్న తనను బయటకు తీసుకువచ్చి రాజకీయం చేశారన్నారు. గల్లీ నుంచి ఢిల్లీదాకా బీసీలకే రాజ్యాధికారం కోసం సంఘటితంగా పోరాడాలన్నారు. వెయ్యిమంది అమర వీరుల కుటుంబాలు బీసీ పోరాటానికి అండగా నిలుస్తాయన్నారు. కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజు యాదవ్ మాట్లాడుతూ.. ఉద్యమకారుల గడ్డ అయిన ఓరుగల్లులో బీసీల రాజకీయ యుద్ధభేరి సభ నిర్వహించడం ఒక చారిత్రాత్మక ఘట్టం అన్నారు. అన్ని పార్టీల ప్రజాప్రతినిదులు, నేతలు, వృత్తి, కుల సంఘాలు ఈ సభలో పాల్గొనడం బీసీల పోరాటానికి ఆరంభం అన్నారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలందరూ ఆశీర్వదించాలని కోరారు.

బీసీ సీనియర్ నాయకుడు ఈగ మల్లేశం మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్లలో బీసీల బతుకులు మారలేదన్నారు. బీసీలందరూ ఒకే కులంగా ఏర్పడి ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడూతూ.. అగ్రవర్ణాల గుండెల్లో తీన్మార్ మల్లన్న నిద్రపోతున్నారన్నారు. రాజ్యాంగాధికారం కోసం కొట్లాడుతామా..? లేక ఇంకా బిచ్చగాళ్లలా బతుకుదామా..? అని ప్రశ్నించారు. నిన్న కేసీఆర్, ఈ రోజు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రులు అయ్యారని, రేపట్టి ఎన్నికల్లో బీసీ అండదండతో ముఖ్యమంత్రి అయ్యేది తీన్మార్ మల్లన్నేనని చెప్పారు. ప్రముఖ రచయిత మిట్టపెల్లి సురేందర్ మాట్లాడుతూ.. ఈ వరంగల్ సభ బీసీల వాటా తేల్చేందుకు తీన్మార్ మల్లన్న నాయకత్వంలో నిర్వహించడం, బీసీ కులాలకు మంచి రోజులన్నారు. విప్లకారులకు, ప్రజాస్వామ్య ఉద్యమ పోరాటాలకు, కళాకారులు అండగా ఉంటారని హామీ ఇచ్చారు.

జామాతే ఇస్లామీ హిందూ జాతీయ అధ్యక్షుడు ఎం.డి. జాఫర్, గాయకుడు ఏపూరి సోమన్న తదితరులు మాట్లాడారు. అంతకు ముందు బీసీ నేతల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్నను వివిధ బీసీ సంఘాలవారు ఘనంగా సత్కరించారు. గదను, నాగలిని బహూకరించారు. కాగా, మిట్టపెల్లి సురేందర్, ఏపూరి సోమన్న, గంగ, పద్మ బృందాలు పాడిన పాటలు సభికులకు ఉర్రూత లూగించారు. మేయర్ గుండు సుధారాణి, బీసీ సంఘాల కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాకారుల ఆటపాటలు

న్యూశాయంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన బీసీ రాజకీయ యుద్ధభేరి సభలో కళాకారులు పాడిన పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి. గాయకులు ఏపూరి సోమన్న, వరంగల్ శ్రీనివాస్, మౌనికయాదవ్ బీసీలపై పాడిన పాటలు అలరించాయి. కళాకారులు పాటలు పాడుతున్నంత సేపు సభకు వచ్చిన ప్రజలు కేరింతలు కొట్టారు.

అతిథులకు స్వాగతం

యుద్ధభేరి సభ ప్రాంగణానికి చేరుకున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, డీఎంకే ఎంపీ విల్సన్, బీపీ మండల్ కుమారుడు సూరజ్ మండల్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ చిరంజీవులుకు సభ నిర్వహణ కమిటీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.



వేదికపై పాటలు పాడుతున్న కళాకారులు

బీసీ సంఘాల ర్యాలీ

సభకు పలు బీసీ సంఘాల నాయకులు మద్దతు తెలుపుతూ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ముదిరాజ్ కులస్థులు, పద్మశాలీ కులస్థులు, మున్నూరుకాపు కులస్థులు యద్ధభేరి బ్యానర్లు చేత పట్టుకుని జై బీసీ.. జై జై బీసీ.. బీసీల ఐక్యత వర్ధిల్లాలి.. అంటూ నినాదాలు చేస్తూ సభకు తరలివచ్చారు.

తీన్మార్ మల్లన్నకు ఘన స్వాగతం

- సభ ప్రాంగణానికి హెలికాప్టర్‌లో రాక
- నాలుగు గంటలు ఆలస్యంగా సభ ప్రారంభం

హనుమకొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లనకు సభా స్థలి వద్ద ఘన స్వాగతం లభించింది. సాయంత్రం 5.30 గంటలకు మల్లన్నతో పాటు సూరజ్ మండల్, డీఎంకే ఎంపీ విల్సన్, బీసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్య హెలికాప్టర్‌లో సభా స్థలికి చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్ద వీరికి ఘన స్వాగతం పలికారు. సభ నాలుగు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. నిర్వాహకులు బీసీ సభ మొదట 3 గంటలకు ప్రారంభం అవుతుందని ప్రకటించారు. దీనితో చాలామంది సభకు చేరుకున్నారు. కానీ సభాప్రాంగణంలో కేవలం కుర్చీలే వేసి చేతులు దులుపుకున్నారు. షామియానాలు వేయలేదు. దీంతో ఎండ తీవ్రతకు చాలా మంది సభా ప్రాంగణంలోకి రావడానికి జంకారు. ముఖ్యంగా మహిళలంతా ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలోని చెట్ల నీడనే కూర్చున్నారు.



మల్లన్నను వేదిక మీదకు ఎత్తుకుని తీసుకువస్తున్న నాయకులు

కుర్చీలన్నీ ఖాళీగా ఉండడంతో నిర్వాహకులు మహిళలను లోపలికి రావాల్సిందిగా పదే పదే కోరినా ఎండ తగ్గేవరకు ఎవరూ లోనికి రాలేదు. సభ సాయంత్రం 5.45 గంటలకు ప్రారంభమైంది. అప్పటికే చాలా మంది తిరిగి వెళ్లిపోయారు.

మేడారంలో జన సందోహం

- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- వనదేవతలకు మొక్కుల సమర్పణ
- మినీ జాతరకు ముందుగానే సందడి



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో కొలువైన వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం భారీగా తరలివచ్చారు. ఈ నెల 12 నుంచి 15వరకు మినీ జాతర(మండ మెలిగె) పండుగ జరుగనుంది. ఈ క్రమంలో వారాంతపు సెలవు రోజు కావడంతో ఇతర రాష్ట్రాల భక్తులు ప్రైవేటు వాహనాల్లో మేడారం చేరుకున్నారు. ముందుగా జంపన్నవాగులో స్నానఘట్టాలపై పుణ్యస్నానాలు చేసి కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. వన దేవతల నామస్మరణలతో సమ్మక్క సారలమ్మలకు జేజేలు పలుకుతూ శివ సత్తుల పూనకాలతో డోలు వాయిద్యాల నడుమ తల్లుల గద్దెలకు చేరుకున్నారు. పసుపు, కుంకుమ చీరె, సారె, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం సమర్పించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో వనదేవతల గద్దెల పరిసరాలు గ్రామ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. తల్లుల గద్దెల ప్రాంగణం సామర్థ్యం అంచనాతో గంటల పాటు రద్దీ కొనసాగిందని సుమారు 70వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాలయం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తెలిపారు. ఈ క్రమంలో భక్తులకు భద్రత కల్పించేందుకు పోలీసులు పరిసరాలో గస్తీ నిర్వహించారు. గద్దెల వద్ద నుంచి జంపన్నవాగు వరకు గ్రామంలో రద్దీ ప్రాంతాలలో 70మందికి పైగా విధులు నిర్వహించారు.

ప్రముఖుల దర్శనాలు

మేడారంలోని సమ్మక్క - సారలమ్మలను దర్శించుకోవడానికి తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జనార్దన్ ఆదివారం కుటుంబ సమేతంగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాదాయ శాఖ అధికారులు, పూజారులు సాదరంగా ఆహ్వానించి దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారులు అమ్మవార్ల ప్రసాదాలను అందజేసి కండువాలను కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో రద్దీగా ఉన్న క్యూ

పారిశుధ్య పనులు

మేడారంలో ఆదివారం కొనసాగిన భక్తుల రద్దీకి అనుగుణంగా గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్మికులతో పనులను జోరుగా కొనసాగించారు. 100 మంది సిబ్బంది పరిసరాల్లోని చెత్తను వెంటవెంటనే తొలగిస్తూ పనులు చేశారు. భక్తులు, స్థానికులకు దుర్వాసనలు వెదజల్లకుండా, ఈగలు దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

వడ్డెపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని కేయూ ప్రొఫెసర్ ఎం.డి. ముస్తఫా అన్నారు. హనుమకొండ వడ్డెపల్లి పిల్లర్‌బెడ్ ప్రాంతంలోని అన్సార్ హైస్కూల్‌లో అన్సార్ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా క్రీడల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, కాంగ్రెస్ 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, ట్రస్టు వైస్ చైర్మన్ ఉమ్మర్, ప్రిన్సిపాల్ చిరంజీవి, పీఈటీ సోహైల్‌ఖాన్, ట్రస్టు సభ్యులు దస్తగిరి, బందగి, మునీరుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ ముస్తఫాతో నిర్వాహకులు

నీళ్లున్నా.. నిధులెట్లా..?!

- కేంద్ర బడ్జెట్‌లో ఓరుగల్లు సాగునీటి ప్రాజెక్టులకు నిరాశ
- దేవాదుల, మోడీకుంట, పాలెంవాగు ప్రాజెక్టులకు కలగని మోక్షం
- కేంద్ర సహకారం లేకపోవడంతో ఓరుగల్లు ప్రాజెక్టులకు ఆటంకాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కేంద్ర బడ్జెట్‌లో ఓరుగల్లు సాగునీటి ప్రాజెక్టులకు నిరాశే మిగిలింది. 2008 నుంచి కేంద్ర ప్రభుత్వం యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రామ్ (ఏఐబీపీ) పథకం కింద ప్రధాన, మధ్య తరహా ప్రాజెక్టులకు కేంద్రం నిధులు కేటాయిస్తోంది. ఈ పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో నాలుగు సాగునీటి ప్రాజెక్టులను చేర్చారు. ఈ ఏడాది భూపాలపల్లి జిల్లాలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును ఏఐబీపీలో చేర్చి, నిధులు కేటాయించాలని నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే కేంద్రం కొత్త ప్రాజెక్టుకు అవకాశం ఇవ్వకపోగా, పాత ప్రాజెక్టులకు నిధుల కేటాయించలేదు. దీంతో కేంద్ర బడ్జెట్‌లో ఓరుగల్లు ప్రాజెక్టులకు ప్రాధాన్యత లేకపోవడంపై రైతాంగంలో ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఏఐబీపీ కింద నాలుగు ప్రాజెక్టులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న పలు సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రామ్ (ఏఐబీపీ) 2008 నుంచి సాయం అందిస్తోంది. 2015-16లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏఐబీపీ, పీఎంకేఎస్‌వై పథకాలను సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రధాన, మధ్యస్థ నీటిపారుదల ప్రాజెక్టులకు ఆర్థిక సాయాన్ని అందించడం ఈ పథకాల ఉద్దేశం. ఈ పథకంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టుతో పాటు మోడీకుంట, పాలెంవాగు ప్రాజెక్టు, ఎస్సారెస్పీ-2 కాలువలను గుర్తించాయి. 2010 నుంచి దేవాదుల ప్రాజెక్టుకు ఏఐబీపీ ద్వారా కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందుతోంది. ఈ నాలుగు ప్రాజెక్టులతోపాటు ఈ ఏడాది కొత్తగా భూపాలపల్లి జిల్లాలోని చిన్న కాళేశ్వరం (ముక్తీశ్వరం) ప్రాజెక్టును ఎంపిక చేయాలని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ అధికారులకు రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో నాలుగు పాత ప్రాజెక్టులతో పాటు కొత్తగా ప్రతిపాదనలు పంపించిన చిన్నకాళేశ్వరం ప్రాజెక్టుకు కూడా ప్రత్యేకంగా నిధుల కేటాయింపులు లేవు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ఖర్చుతో పూర్తయ్యే వాటిని ప్రాధాన్యత ప్రాజెక్టులుగా గుర్తించినప్పటికీ కేంద్ర సహకారం లేకుండా ముందుకు వెళ్లటం ఆర్థికభారం పడనుందనే చర్చ జరుగుతోంది.

దేవాదుల, చిన్నకాళేశ్వరం, ఎస్సారెస్పీ-2లకు నిరాశే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 6లక్షల ఎకరాలకు సాగు నీరం దించాలనే లక్ష్యంతో 2003లో ప్రారంభించిన దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు ఇప్పటికే అసంపూర్తిగానే మిగిలింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపైనే అధికంగా దృష్టి సారించింది. దీంతో దేవాదుల ప్రాజెక్టుకు అరకొర నిధులు కేటాయింపులు చేయటం, కేంద్రం ఏఐబీపీ పథకం ద్వారా కేటాయించిన నిధులు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణం, చిన్నచిన్న మరమ్మతులకే పరిమితమయ్యాయి. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులను గుర్తించి ప్రాధాన్యత ప్రాజెక్టులుగా చేపడుతున్నారు. అందులో భాగంగా దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టును ఆగస్టు 30వ తేదీన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. 2026 మార్చినాటికి దేవాదులను పూర్తి చేస్తామని ప్రకటించారు. జంగిల్ కటింగ్, డీసిల్టింగ్ పనులకు రూ.1,100కోట్లు విడుదల చేస్తామని తెలిపారు. అయితే ఇప్పటివరకు దేవాదుల కోసం రాష్ట్రం నుంచి నిధులు కేటాయింపులు జరగలేదు. కేంద్ర బడ్జెట్‌లో ఏఐబీపీ పథకం కింద దేవాదుల ప్రాజెక్టుకు రూ.100కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అయితే బడ్జెట్‌లో దేవాదులకు ప్రత్యేకంగా కేటాయింపులు ఏమీ ప్రకటించలేదు.

ఎస్సారెస్పీ-2 ద్వారా 4.40లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలోని రైతాంగానికి 24.405 టీఎంసీల నీటిని పంటలకు అందిస్తున్నారు. రూ.1,043.14కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 1:3 భాగస్వామ్యంతో కాలువలను పూర్తి చేయాల్సి ఉంది. ఏఐబీపీ ద్వారా కేంద్రం సుమారు రూ.252కోట్ల వరకు నిధులు కేటాయించాల్సి ఉంది. అయితే కేంద్రం అరకొర నిధులు కేటాయిస్తూ వస్తోంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఏఐబీపీ ద్వారా ఎస్సారెస్పీ-2కు నిధులు కేటాయింపులు లేకపోవటంతో పెండింగ్ పనులు పూర్తి చేయడానికి ఆటంకాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. 20ఏళ్ల అంచనా వ్యయం భారీగా పెరుగుతోంది. దీంతో ఎస్సారెస్పీ-2 పనులు అసంపూర్తిగానే మిగిలిపోతున్నాయి.

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని పాలెంవాగుకు కూడా ఏఐబీపీ ద్వారా నిధులు కేటాయింపులు చేయాల్సి ఉంది. వీటితో పాటు ఈ ఏడాది భూపాలపల్లి జిల్లా మహదేవపూర్- కాటారం మండలాల్లో నిర్మిస్తున్న చిన్న కాళేశ్వరం (ముక్తీశ్వర) ప్రాజెక్టును ఏఐబీపీ పథకంలో చేర్చాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ కేంద్ర జల్‌శక్తిమంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సుమారు రూ.560కోట్ల వరకు ఖర్చు అవుతుందని, ఏఐబీపీ ద్వారా రూ.171కోట్లు కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చిన్నకాళేశ్వరాన్ని ఏఐబీపీలో చేర్చాలని చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవటం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది.



పాలెంవాగు ప్రాజెక్టు

కాగితాల్లో మోడీకుంట ప్రాజెక్టు

20ఏళ్లుగా గిరిజనుల కలల ప్రాజెక్టు కాగితాల్లోనే మిగిలిపోతోంది. ఏజెన్సీ రైతాంగానికి సాగునీటితో పాటు తాగునీటిని కూడా అందించాలనే లక్ష్యంతో 2005లో అప్పటి ఖమ్మం జిల్లా ప్రస్తుత ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామ సమీపంలోని మోడీకుంట వాగుపై భారీ మధ్యతరహా ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గోదావరిలో 3.716టీఎంసీల మోడీ కుంటవాగు నీరు వృథాగా కలుస్తోంది. దీంతో ఈ ప్రాజెక్టుతో 2.142 టీఎం సీల నీటిని ఎత్తిపోసి 13,591 ఎకరాలకు సాగునీరందించాలని, 0.12టీ ఎంసీల నీటిని 35 గ్రామాలకు తాగునీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకు న్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి 2005లో ప్రభుత్వం రూ.124.60కోట్లతో టెండ ర్లు పిలువగా, రూ.118.95కోట్లతో పనులు చేపట్టేందుకు గ్యామన్ ఇండియా అనే కంపెనీ ముందుకు వచ్చింది. అటవీశాఖ అభ్యంతరాలతో పనులు షురువు కాలేదు. 2018లో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ప్రజాభిప్రాయ స్వీకరణ తరువాత ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.425.16కోట్లకు పెంచారు. ఆ తరువాత కరోనా విజృంభించటంతో పాటు ధరలు విపరీతంగా పెరగటంతో 2021-22లో ఈ అంచనా వ్యయాన్ని రూ.527.66కోట్లకు పెంచారు. పనులు మాత్రం మొదలు కాలేదు. కాగితాల్లోనే అంచనా వ్యయం పెరుగుతూ వస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.500.25కోట్లతో సీడబ్ల్యుసీకి ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించటంతో పాటు ఏఐబీపీలో చేర్చి రూ.276కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అయితే కేంద్ర బడ్జెట్‌లో మోడీకుంట ప్రాజెక్టుకు రూ.276కోట్లు కేటాయింపులు లేకపోవటంతో ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 20 ఏళ్ల మోడీకుంట ప్రాజెక్టు కాగితాల్లోనే అంచనా వ్యయాలు పెరుగుతున్నాయని, పనులు మాత్రం జరుగటం లేదు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు లేకపోవటంతో ఈ ఏడాది కూడా మోడీకుంట ప్రాజెక్టుకు మోక్షం లేనట్లేననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు అనంతారంలో ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. అనంతారంకు చెందిన ఎస్‌కె. సలాం (57) పాలిష్‌బండ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అనంతారంలో ఓ ఇంటిలో పాలిష్‌బండలు వేస్తుండగా మిషన్‌కు కరెంట్ సరఫరా అయి విద్యుదాఘాతంకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య షైబూబీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. షైబూబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు, ఆటోను ఢీకొట్టిన కారు

• ముగ్గురికి తీవ్ర గాయాలు


జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రశాంత్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రెండు ద్విచక్రవాహనాలు, ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలై, నలుగురికి స్వల్పగాయాలైన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు బీజేపీ పార్టీ కార్యాలయం సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. వేమునూరు గ్రామానికి చెందిన బానోత్ సురేష్, భూమిక దంపతులు, అతని కుమారుడు జయవర్ధన్ జ్వరం రాగా వైద్యచికిత్స నిమిత్తం తన ద్విచక్రవాహనంపై మానుకోటకు వస్తున్నారు. ఈదులపూసపల్లికి చెందిన బండి రవీందర్ తన ఆటోలో అదే గ్రామానికి చెందిన జక్కుల కాశమ్మ మహబూబాబాద్‌కుతీసుకువస్తుండగా, చిన్నకిష్టాపురానికి చెందిన రామరాజు వెంకన్న అతని కుమారుడు ప్రశాంత్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పని నిమిత్తం జిల్లా కేంద్రానికి వస్తుండగా.. మానుకోట నుంచి కేసముద్రం వైపు వెళ్తున్న కారు బీజేపీ కార్యాలయం సమీపం వద్దకు రాగానే అతివేగంగా ఎదురుగా వచ్చే రెండు ద్విచక్రవాహనాలను, ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో రామరాజు వెంకన్న, అతని కుమారుడు ప్రశాంత్, బానోత్ జయవర్ధన్‌కు తీవ్రగాయాలు కాగా మిగతా నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. వారందిరిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.


గార్ల మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు


మునిగలవీడులో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు


మానుకోట పట్టణంలో కేంద్ర బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కేంద్ర బడ్జెట్‌పై నిరసన వెల్లువ

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలా గారడిలా ఉందని, దేశంలో పేదల్ని నిర్మూలించే బడ్జెట్‌లా లేదని, ఆర్థిక కేటాయింపులే తప్ప దళితుల అభ్యున్నతికి ఏనాడు ఖర్చు చేసిన దాఖలాలు లేవని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ మహబూబాబాద్ పట్టణంలో హనుమంతరావు నగర్ స్థూపం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ బడ్జెట్ అంకెల్లో తప్ప, ఆచరణలో దళితుల అభివృద్ధి చేసింది శూన్యమని చెప్పారు. దేశంలో 20 కోట్ల జనాభా కలిగిన దళితులకు జానాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదని విమర్శించారు. 2024-25 బడ్జెట్‌లో రూ.165.597 కోట్లు కేటాయించి ప్రస్తుతం దానికి రూ.3 వేలకోట్లు మాత్రమే అదనంగా పెంచారని తెలిపారు. చీపిరి యాకయ్య, దైద సురేంద్రనాథ్, నూనె శ్రీనివాస్, పిట్టల ఉపేందర్, బేతమల్ల వెంకటాద్రి, వీరభద్రం, ఉస్మాన్, రమేష్, మాదాసు శ్రీను, జగన్నాథం, శంకర్, దేవయ్య పాల్గొన్నారు.

● నెల్లికుదురు (ఆంధ్రజ్యోతి): మునిగలవీడులో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితులకు బడ్జెట్ కేటాయించలేదని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం బడ్జెట్ కేటాయింకుండా దళితులను మోసం చేస్తుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అనసూర్య, పూలమ్మ, నీలమ్మ, ఎలేంద్ర, వెంకటమ్మ, ఎల్లమ్మ, ఉపేంద్ర, ఇద్దమ్మ, మంగమ్మ, పాల్గొన్నారు.

● గార్ల, (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ పేదలకు ఆశాజనకంగా లేదని సీపీఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి విమర్శించారు. గార్లలోని నెహ్రూసెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపిందన్నారు. నాయకులు అంబటి వీరస్వామి, కందునూరి శ్రీనివాస్, వి.వెంకటేశ్వర్లు, నాగరాజు, మల్లయ్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నెహ్రూకు మాతృవియోగం

• ఎమ్మెల్యే మురళీనాయక్ సహా పలువురి పరామర్శ


లక్ష్మి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

కురవి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మాజీ సర్పంచ్ భూక్య నెహ్రూనాయక్ తల్లి భూక్య లక్ష్మి (90) అనారోగ్యంతో కీమతండాలో శనివారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్-ఉమ దంపతులు, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్, మహబూబాబాద్‌మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌లు కీమతండాకు చేరుకుని లక్ష్మి మృతదేహం సందర్శించి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నెహ్రూనాయక్‌ను పరామర్శించిన వారిలో మాజీ ఎంపీలు సీతారాంనాయక్, మాలోతు కవిత, ఏసీపీ రమేష్, వివిధ పార్టీ, ప్రజా, కుల సంఘాల నాయకులు గుగులోతు శ్రీరాంనాయక్, దేవరం ప్రకాష్‌రెడ్డి, డోలి సత్యనారాయణ, బజ్జూరి పిచ్చిరెడ్డి, బొడ్డుపల్లి ఉపేందర్, గుగులోతు రవినాయక్, దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, ఆకుల రాజు, లాలునాయక్, బాదె నాగయ్య, కొప్పుల సదానందం, తుకారంనాయక్, దైద భద్రయ్య, డాక్టర్ బి.అనిల్‌గుప్తా, బండారు వెంకటరమణ, లూనావత్ అశోక్‌నాయక్, గుగులోతు భీమానాయక్, ముత్యం వెంకన్న, మహబూబ్‌పాషా, గౌడుగు శ్రీనులు ఉన్నారు.

పాలేరుపై మాజీమంత్రి భార్య ప్రతాపం

• మనస్తాపంతో బాధితుడు పురుగుల మందుతాగి, ఆత్మహత్యాయత్నం

• జిల్లా ఏరియా ఆస్పత్రిలో చికిత్స


చికిత్స పొందుతున్న యాకుబ్

చిన్నగూడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉగ్గంపల్లి శివారు మంచ్యాతండాలో పాలేరుపై మాజీమంత్రి రెడ్యానాయక్ భార్య లక్ష్మి చేయిచేసుకోగా, బాధితుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితుడు ధర్మసోత్ యాకూబ్ తెలిపిన వివరాల ప్రకారం. కొన్నేళ్లుగా రెడ్యానాయక్ ఇంట్లో ధర్మసోత్ యాకుబ్ పాలేరుగా పని చేస్తున్నాడు. యాకూబ్ అనారోగ్యంతో ఒక్కరోజు పనికి వెళ్లకపోవడంతో లక్ష్మి అతని ఇంటికి వచ్చింది. యాకూబ్‌పై చేయిచేసుకొని, గొంతు నలిమి చితకబాదింది. దీంతో అతడు మనస్తాపంతో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రైతులు విద్యుత్ వైర్లు అమర్చొద్దు

ములుగు సీఐ శంకర్

ములుగు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు విద్యుత్‌వైర్లు, ఉచ్చులు అమర్చకూడదని ములుగు సీఐ శంకర్ సూచించారు. ఆదివారం ఆయన ములుగు మండలంలోని అబ్బాపూర్, శ్రీరాములపల్లి, కుమ్మరిపల్లి, బాణాలపల్లి గ్రా మాల శివారుల్లోని రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యుత్ వైర్లు అమర్చడం మూలంగా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లనుందని, పశువులు మృత్యువాత పడే అవకాశం ఉందని అన్నారు. ఎవరైనా విద్యుత్‌వైర్లు అమర్చినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై వెంకటేశ్వర్‌రావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు

కొనసాగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ మూర్తి ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం నాల్గవ రోజు ఆదివారం అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ నిర్మాణ బాధ్యులు, మాజీ సర్పంచ్ యాస రమావెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రాబోదకి, 9 గంటలకు నిత్యహవన పారాయణాదులు, నిత్య పూర్ణాహుతి, మంగళాశాసనము, తీర్థప్రసాద గోష్ఠి, సాయంత్రం 5 గంటల నుంచి సమష్టి శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్య హోమ పారాయణాదులు, ధాన్యాధివాస-శయ్యాధివాసములు, అధివాస హోమములు, నిత్యపూర్ణాహుతి, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి గావించారు.

సంక్షిప్త వార్తలు

రుణమాఫీ అమలు కాలేదని బ్యాంకు మేనేజర్‌కు వినతి


ఐవోబీ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇనుగుర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు పరిధిలో చాలామంది రైతులకు రుణమాఫీ అమలు కాలేదని, వెంటనే రైతులకు రుణమాఫీ వచ్చేలా చూడాలని ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ దీకొండ వెంకన్న, గ్రామపార్టీ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య మాట్లాడుతూ ఈ బ్యాంకులో చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదని, దీనికి సాంకేతిక సమస్య అయిఉండవచ్చని తెలిపారు. దార్ల రాంమూర్తి, గండు నాగన్న, జాటోత్ హరిచంద్, పింగిళి శ్రీను, మాలోత్ మంగ్యానాయక్, గుండ్రపల్లి దేవేందర్, కూరెల్లి నాగరాజు, సంతోష్ పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ పోస్టర్ ఆవిష్కరణ


'లక్ష దప్పులు – వెయ్యి గొంతుకలు' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కేసముద్రం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఈనెల 7న నిర్వహించే 'లక్ష దప్పులు- వెయ్యి గొంతుకలు' పోస్టర్లను కేసముద్రంలో ఆదివారం ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము నాగరాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంద విక్రం, కంటిపూడి అరుణ్‌కుమార్, పొలెపాక శంకర్, బిర్రు యుగేందర్, పందుల సంజీవ, వల్లందాసు రవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

కొత్తగూడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గాంధీనగర్‌లోని గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 1998, 1999, 2000, 2001, 2002 విద్యా సంవత్సరాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు గురుకుల పాఠశాలలో కలిసి, సంతోషంగా ముచ్చటించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

బేతోలు గ్రామ సీపీఎం కార్యదర్శిగా వెంకన్న

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ 6వ వార్డు బేతోలు గ్రామ సీపీఎం శాఖ కార్యదర్శి ఏనుగంటి వెంకన్న ఎన్నికయ్యారు. బేతోలు గ్రామంలో ఆదివారం సీపీఎం ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, 6వ వార్డు ఇన్‌చార్జి ఎమ్డీ. రజాక్ నేతృత్వంలో బేతోలు గ్రామశాఖను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఏనుగంటి వెంకన్న, సహాయ కార్యదర్శిగా పూసపాటి రమేష్‌తో పాటు 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో యూసూబ్, రామన్న, నరేష్, శ్రీను, ఎల్లయ్య, నవీన్, భాస్కర్, రమేష్, సీతారాం, బాబుమియా, వెంకన్న పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లు వర్తింప చేయాలి'


నియమాక పత్రాలను అందచేస్తున్న వెంకటరమణ

మరిపెడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జనాభా ప్రాతిపాదికన స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లు వర్తింప చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బండారు వెంకటరమణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం సమావేశం మరిపెడ మునిసిపల్ కేంద్రంలో జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మరిపెడ మండల, పట్టణ కమిటీని ప్రకటించి వారికి నియమాకపత్రాలను అందచేశారు. అధ్యక్షుడిగా దిగిజర్ల ముఖేశ్, కార్యదర్శిగా మామిడాల మునేశ్, మరిపెడ పట్టణ అధ్యక్షుడిగా దేవరశెట్టి లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీధర్‌స్వామి, జిల్లా నాయకులు తోట లాలయ్య, గంధసిరి కృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'బహుజనులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలి'


మోకు దెబ్బ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): బహుజనులంతా ఐకమత్యంతో ఉంటూ ముందుకు సాగాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో గౌడ జన హక్కుల సమితి, మోకుదెబ్బ -2025 క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని చెప్పారు. సమిష్టిగా ఉంటూ తమ హక్కులను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్‌గౌడ్, లింగాల వీరభద్రం, గడ్డం సమ్మయ్య, భద్రసేన, శ్రీనివాస్, గాడిపెల్లి శేఖర్, గండి వీరేందర్, శ్రీధర్, గుగులోతు వెంకట్, శంకర్, యుగేందర్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం కూలీల బకాయి బిల్లులను చెల్లించాలి

• సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్

కేసముద్రం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకంలో గత ఏడాది పనిచేసిన కూలీలకు నేటి వరకు డబ్బులు చెల్లించలేదని, వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ డిమాండ్ చేశారు. కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని ఎర్రగడ్డకాలనీలో ఆదివారం ఆయన మాట్లాడుతూ బకాయిలు ఉన్న ఉపాధి కూలీ డబ్బులు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. ఆయన వెంట రాపోలు సమ్మయ్య, యాకమ్మ, భూలక్ష్మి, ఆలకుంట్ల సమ్మక్క, ముద్దంగుల సరిత, రాపోలు స్వరూప, సావిత్ర, సమ్మక్క శారద, సంపత్, సరిత, రాజు, శిరీష పాల్గొన్నారు.



కేసముద్రంలో మాట్లాడుతున్న జయరాజ్



జడ్పీహెచ్ఎస్ పాఠశాలను కూల్చిన ప్రదేశంలో ధర్నా నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

'జూనియర్ కళాశాలను నిర్మించాలి'


కురవి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో 70 ఏళ్ల క్రితం నాటి జడ్పీహెచ్ఎస్ పాఠశాలను కూల్చిన స్థలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటుచేసి నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాలను కూల్చిన స్థలంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ పాఠశాలను కూల్చిన స్థలంలోనే జూనియర్ కళాశాలలేని కురవిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేసి నిర్మించాలని డిమాండ్ చేశారు. అత్యధికంగా గిరిజనులు ఉన్న కురవి ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పీడీఎస్‌యూ నాయకులు హన్మంతు, ప్రవీన్, హేమంత్, రాజేష్, అఖిల్ పాల్గొన్నారు.

నేటి గ్రీవెన్స్‌సెల్ రద్దు : కలెక్టర్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్‌లో నేడు నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నందున ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు సోమవారం గ్రీవెన్స్‌సెల్‌ను రద్దు చేసినట్లు వివరించారు.

'కబ్జా చేసిన నిందితులను శిక్షించాలి'

మరిపెడ, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి) : డొంకను కబ్జా చేసిన నిందితులపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. మరిపెడ మునిసిపల్ పరిధి నామ్లాతండాకు చెందిన దామా ఆదివారం మండల్ పరిషత్ ఆవరణలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ ఎక్కి నిరసన చేశారు. స్థానికుల బుజ్జగింపుతో ట్యాంక్ దిగి దామా విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయం చేసుకు వెళ్లే డొంకను అదే తండాకు చెందిన ఓవ్యక్తి కబ్జా చేశాడని పలుమార్లు రెవెన్యూ, పోలీస్ అధికారులకు విన్నవించినా ఫలితంలేదని వాపోయారు. సదరు వ్యక్తి కొందరిని తనపై ఉసిగొల్పి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, వారి ఫొటోలతో ఫ్లెక్సీ తయారు చేసి ఆ ఫ్లెక్సీకి చెప్పుల దండాలేసి ట్యాంక్‌కు పెట్టి నిరసనకు దిగాడు.


ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న యువకుడు దామా

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు ఆటోడ్రైవర్ల మృతి

• రాంగ్ రూట్‌లో వస్తూ ఒకరు, ఓవర్ టేక్ చేస్తూ మరొకరు.. • మృతుల్లో ఒకరు సిద్దిపేట జిల్లా వాసి

చిలుపూర్ (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతిచెందిన ఘటన నష్కల్ స్టేజీ సమీపంలో హైవేపై జరిగింది. ఆదివారం ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కథనం ప్రకారం. పాలకుర్తి మండలం బమ్మెరకు చెందిన ఆటోడ్రైవర్ వంగాల నాగరాజు (28) శనివారం అర్ధరాత్రి తన ఆటోలో కరుణాపురం-వంగాలపల్లి చౌరస్తా నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ వైపు రాంగ్‌రూట్‌లో వెళ్తున్నాడు. నష్కల్ స్టేజీ ఎదురుగా యూటర్న్ వద్ద ఎడమ వైపు రోడ్డు క్రాస్ చేస్తున్న క్రమంలో, హైదరాబాద్ నుంచి హన్మకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కాగా, నాగరాజుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడి తండ్రి అబ్బసాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జనగామలో సిద్దిపేటవాసి మృతి

జనగామ రూరల్ : బస్సును ఓవర్ టెక్ చేయబోయి యువకుడు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం రెడ్యానాయక్ తండాకు చెందిన ధరావత్ విజయ్(35) హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ భార్య పిల్లలతో జీవిస్తున్నాడు. విజయ్ ఆదివారం స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా నెహ్రూపార్కు సమీపంలోని బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టెక్ చేయబోయి బస్సు ఆటో ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై చెన్నకేశవులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విజయ్‌కి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ క్షేత్రంలో విద్యుదాఘాతంతో రైతులు మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పడమటికేశ్వాపూర్ కు చెందిన రైతు శ్రీరాముల శ్రీనివాస్ (44) మల్బరీ తోటను చూసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. రోజు పనికి వచ్చేకూలీవాళ్లు ఉదయం ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ ఉండటంతో పొలం వద్దకు రాగా బాత్రూంలో కరెంటు షాక్ తగిలి మృతి చెందడంతో అతని భార్య ఝాన్సీకి సమాచారం అందించారు. మల్బరీ తోటలో వాడే వాటర్ ప్రేజర్ స్ప్రేగన్‌తో బాత్రూంను శుభ్రపరుస్తుండగా షాక్ కొట్టి మృతి చెందినట్టు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్‌కే హమీద్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పండ్ల షాపు దగ్ధం

జనగామ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జనగామ రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ పండ్ల షాపులో ఆదివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రానికి చెందిన కొల రమేశ్ కొన్నేళ్ల నుంచి రైల్వేస్టేషన్ సమీపంలో పండ్లు అమ్ముకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. షార్ట్‌సర్క్యూట్‌తో పండ్ల షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపులోకి తీసుకొని వచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. సుమారుగా రూ.60వేల విలువైన పండ్లు దగ్ధమైనట్టు రమేశ్ వాపోయాడు.